జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 3-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 501 పేజీలు: 4 వెల : రూ.7

## ఇకపై ప్రైవేట్ ఆలయాలపై..
# ప్రత్యేక పర్యవేక్షణ

* తొక్కిసలాట వల్లే భక్తుల మృతి * భక్తులు సంయమనం పాటిస్తే బాగున్ను * బాధితులకు అండగా ప్రభుత్వం * ఆలయ నిర్మాణం ఆగమ శాస్త్రం ప్రకారం జరగలేదు * ఆలయ నిర్మాణకర్తకు సలహాలు ఇస్తాం * ఈ ఘటనపై త్రిసభ్య కమిటీ విచారణ * రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి * కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయం పరిశీలన * క్షతగాత్రులకు పరామర్శ * తక్షణ నష్టపరిహారం అందజేత



**పలాస, నవంబరు 2 (వార్త):** ఇక నుంచి ప్రైవేటు ఆలయాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, దీని కోసం ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో చర్యలు చేపడతామని చెప్పారు. ప్రైవేట్ ఆలయాల వివరాలను తీసుకుంటామని,. అడ్వైజరీ కమిటీని నియమించి ఆలయాల నిర్మాణాలు, వాటి జాబితా తయారు చేస్తామన్నారు. ఆదివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి వేంకటేశ్వర ఆలయ ప్రాంగణాన్ని, ప్రమాద ఘటన జరిగిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. పలాస చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను, మృతుల కుటుంబాలను పరామర్శించి తక్షణ సాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన యాదృచ్ఛికంగానే జరిగిందన్నారు. ఒకేసారి ఎక్కువ మంది భక్తులు రావడంతో ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. భక్తులు కొంచెం సంయమనం పాటించివుంటే బాగుండునని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నిర్వాహకులు సైతం సరైన జాగ్రత్తలు తీసుకొని ఉండాల్సిందన్నారు. ముకుంద పండా మంచి ఉద్దేశంతోనే ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇంజనీర్ల సలహాలు తీసుకోలేదన్నారు. అది ఆగమశాస్త్ర ప్రకారం జరగలేదని తెలిపారు. ఆయనకు సూచనలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. దీనికి ముకుందపండా సహకరించాల్సివుందన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, 24 గంటల వ్యవధిలోనే మృతుల కుటంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.15లక్షలు, కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.2లక్షలు అందించామన్నారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై విచారణకు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, శ్రీకాకుళం ఏఎస్పీ కేవీ రమణ, దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్‌తో కూడిన త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రైవేటు ఆలయంలో జరిగిన ఘటనను వైసీపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. గత వైసీపీ పాలనలో ఆలయాలపై అనేక దాడులు జరిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి గౌతు శివాజీ, ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్, వై.వెంకన్నచౌదరి తదితరులు ఉన్నారు.

## తొక్కిసలాటపై దర్యాప్తు

* తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు
* ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి
* అవాస్తవాలు నమ్మకండి
* విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



**శ్రీకాకుళం,నవంబరు 2(వార్త):** కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై పూర్తిస్థాయి లో దర్యాప్తు సాగుతుందని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో కొంతమంది అవాస్తవాలు, అసత్య, దుష్ప్రచారాలు చేస్తున్న నేప థ్యంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జట్టి శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు, అసత్య సమాచారం వ్యాప్తి చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమన్నారు. ఇటువంటి పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. పోస్టులు పెట్టిన వివరాలు, లొకేషన్ ఆధారంగా గుర్తించి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

* తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశిచ్చాం * కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు * మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు ఆర్థిక సాయం పంపిణీ



**టెక్కలి, నవంబరు 2 (వార్త):** బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కాశీ బుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రిల్స్ విరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఆదివారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి బాధితుల నివాసాలకు వెళ్లి వారి ఓదార్చడంతో పాటు తక్షణ సాయం అందజేశారు. ప్రైవేటు ఆలయం కావడంతో నిర్లక్ష్యం చోటుచేసుకుని ఉండొచ్చని, అయినప్పటికీ ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుని సమగ్ర విచారణ చేపడుతుందన్నారు. ఈ దుర్ఘటనను రాజకీయాలకు అన్వయించడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వారి వెంట పలాస శాసనసభ్యులు గౌతు శిరీష, పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రన్న ఆశయసాధనకు కృషిచేస్తాం

* కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు
* నిమ్మాడలోని ఎర్రన్న ఘాట్‌లో నివాళి

**కోటబొమ్మాళి, నవంబరు2 (వార్త):** దివంగత నేత ఎర్రన్నాయుడు ఆశయసాధనకోసం కృషిచేస్తామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యకార, పాడిపరిశ్రమశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌరవిమానయశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద మంత్రులతో పాటు కుటుంబీకులు, ఎమ్మెల్యేలు నివాళులు అర్పించారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఎర్రన్న వర్ధంతి నిర్వహించారు. నిమ్మాడ ఘాట్‌లో ఎర్రన్న సోదరులు కింజరాపు హరిప్రసాద్, ప్రభాకర్, పలాస మాజీ శాసన సభ్యులు గౌతుశ్యాంసుందర్ శివాజీ, గొండు శంకర్, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, శాసన




సభ్యులు బంగారు సత్యన్నారాయణ మూర్తి, మాజీ శాసన మండలి సభ్యులు విశ్వప్రసాద్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చౌదరి నారాయణమూర్తిలతో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఏపీలో అసలు ప్రభుత్వం ఉందా?

* కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది మూడో తొక్కిసలాట
* సనాతన ధర్మమని పెద్ద పెద్ద మాటలు చెబుతారు
* ఈ ఘటనపై సిట్టింగ్, రిటైర్డు జడ్జితో విచారణ జరపాలి
* మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, వైసీపీ నేత బొత్స సత్యనారాయణ
* రెడ్ బుక్ తప్ప... రూల్ బుక్ ఉందా?: మాజీ మంత్రి కన్నబాబు

**పలాస, నవంబరు2 (వార్త):** కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లో ఆలయాల వద్ద తొక్కిసలాట జరిగి పలువురు మృతి చెందడం ఇది మూడో సారని మాజీ మంత్రి, వైసీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. ఇలాంటి తరచూ జరుగుతుంటే ఏపీలో అసలు ప్రభుత్వం ఉందా అన్న అనుమానం కలుగుతోందన్నారు. కూటమి నేతలు మాత్రం సనాతన ధర్మమని పెద్ద పెద్ద మాటలు చెబుతారు తప్ప చేసేదేమీ ఉండదని ఎద్దేవా చేశారు. కాశీబుగ్గ ప్రమాద బాధితులను ఆదివారం ఆయన నేతలతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట జరిగి పలువురు మృతి చెందడం, మరికొందరు గాయపడడం దురదృష్టకరమన్నారు. తమ పార్టీ తరఫున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానన్నారు. ప్రతీ శనివారం కాశీబుగ్గ ఆలయానికి వేలాదిగా భక్తులు వస్తారని, అంచనా వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రైవేట్ ఆలయం అంటూ చూస్తు వదిలేస్తారా అనిబొత్స నిలదీశారు. కాశీబుగ్గలో స్థానిక పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తిరుపతి, సింహాచలం ఘటనల్లో ఎవరి మీద చర్యలను తీసుకున్నారో బహిర్గతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై దేవుడికి కూడా కోసం ఉన్నట్టు ఉందని, అందుకే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. కాశీబుగ్గ ఘటనపై సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలని, అప్పుడే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం రూ. 25 లక్షలు ఇవ్వాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య ం కారణంగా కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన జరిగిందన్నారు. అధినేత వైయస్ జగన్ ఆదేశాల మేరకు బాధితులకు ప్రాథమిక విద్య సహాయం అందించామన్నారు. మాజీ మంత్రి కొరసాల కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ తప్ప రూల్ బుక్ ఉందా అని ప్రశ్నించారు. నిమిత్తమాత్రులం అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైరాగ్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆలయమని మాట్లాడుతున్నారన్నారు. ఆసుపత్రులను ప్రైవేటుకు ఇచ్చినట్లు ఆలయాలను కూడా ప్రైవేటుకు ఇస్తున్నామని చెప్పాలన్నారు. ఆలయాల్లో భద్రత కోసం ప్రభుత్వం దగ్గర ప్రణాళిక ఉందా? అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



# కనులపండువగా.. తెప్పోత్సవం

**అరసవల్లి, నవంబరు 2(వార్త):** కార్తీక మాసంలో క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హంస నావికోత్సవం (తెప్పోత్సవం) ఆదివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ముగిసింది. ఈ మహోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ పర్యవేక్షించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకున్నారు. ఆదివారం కావడంతో ఈ వైభవాన్ని తిలకించేందుకు భక్తజనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో కేఎస్వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ నేతృత్వంలో ఉత్సవం ప్రారంభమైంది. ఉషా, ఛాయ, పద్మినీ సమేతుడైన స్వామివారిని అలంకరించి, విద్యుత్ కాంతుల మధ్య హంసనావపై ఇంద్ర పుష్కరిణిలో ఊరేగించారు. తెప్పోత్సవం అనంతరం స్వామివారికి తిరువీధిలో ఊరేగించారు. అనివెట్టి మండపంలో క్షీరాబ్ధి ద్వాదశి వ్రతం నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది తగిన భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులు రద్దీ దృష్ట్యా క్యూ లైన్లు క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భక్తుల రాకపోకల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఇంద్ర పుష్కరిణి నలువైపుల ప్రత్యేకమైన బారికేడ్లు ఏర్పాటు చేసి, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అలాగే గార మండలంలో శ్రీకూర్మం శ్రీ కూర్మనాథ స్వామి ఆలయంలో శ్వేత పుష్కరిణిలో కూడా తెప్పోత్సవం ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ శేషాద్రి ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు భద్రతతో ప్రశాంతంగా సాగింది.












## సముద్రంలో మునిగిన బోటు

**సోంపేట, నవంబరు2(వార్త):** సోంపేట మండలం ఎక్కువురు గ్రామం సమీపంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వారి బోటు ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు మునిగిపోయింది. వేట సాగిస్తున్న మత్స్యకారులు మాత్రం చాకచక్యంగా తప్పించుకొని ఒడ్డుకు చేరుకున్నారు. బోటు యజమాని కొండ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల 11 లక్షల రూపాయల ఖర్చుతో తయారు చేయించిన ఫైబర్ బోట్‌లో ఆదివారం ఉదయం మత్స్యకారులు వేటకు వెళ్లారన్నారు. తిరిగి వస్తుండగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అలలకు సుమారు మూడు టన్నుల చేపలతో బోటు మునిగిపోయిందన్నారు. అయితే మత్స్యకారులు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారన్నారు. బోటు బయటకు తీసేందుకు గ్రామస్తులు సహకారంతో ప్రయత్నించినా ఫలితమివ్వలేదు.



## ఎస్‌జీఎఫ్ జిల్లా క్రికెట్ జట్టులో ట్రిపుల్ ఐటి విద్యార్థి

**ఎచ్చెర్ల, నవంబరు2(వార్త):** రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ), ఎచ్చెర్ల క్యాంపస్‌కు చెందిన విద్యార్థి సాయి గణేష్, ప్రతిష్ఠాత్మక ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. అండర్-19 విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు తరపున సాయి గణేష్ ప్రాతినిధ్యం వహించనున్నారు. శ్రీకాకుళంలో సోమవారం నుంచి 6వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. విద్యార్థి ప్రతిభను ఆర్జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.వి.జి.డి. బాలాజీ అభినందించారు. క్రీడల్లో మరింత రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.వో. డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, పి.ఇ.డి. అధ్యాపకులు టి. దిలీప్ కుమార్, కృష్ణంరాజుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొని సాయి గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.





## 25 నాటికి జాయింట్ ఎల్పీఎం సమస్యలు పరిష్కరించాలి

**శ్రీకాకుళం, నవంబరు2(వార్త):** రీ సర్వేలో భాగంగా జరుగుతున్న జాయింట్ ఎల్పీఎం సమస్యల పరిష్కారాన్ని ఈనెల 25 నాటికి పూర్తి చేయాలని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సి.హెచ్.వి.ఎస్.ఎన్. కుమార్ ఆదేశించారు. గత రెండు రోజులుగా జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆయన భూమి రీసర్వే పనుల నాణ్యతను, పురోగతిని సమీక్షించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో రీసర్వే పై డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీసర్వేకు సంబంధించిన అన్ని దశలలో రికార్డులను సంపూర్ణంగా తనిఖీ చేయాలని క్షేత్రస్థాయిలో నూరు శాతం ఖచ్చితత్వం సాధించాలని ఆదేశించారు. భూ యజమానులకు భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రాకుండా సర్వే పనులు నిర్వహించాలని, మొదటి, రెండవ విడతల్లో మిగిలిన పనులను నిర్ణీత గడువు ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అత్యంత కీలకమైన అంశం 'జాయింట్ ఎల్పీఎం (ఉమ్మడి సరిహద్దు సమస్యలు) పరిష్కారంపై జేడీ దృష్టి సారించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో ఈ సమస్యలు తలెత్తకుండా అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గతంలో వచ్చిన వినతుల్లో విభజనకు అర్హత కలిగిన వాటిని గుర్తించి, ఈనెల 25వ తేదీలోగా విభజన పనిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, ప్రభుత్వ రెవెన్యూ భూములు సరిహద్దులు నిర్ణయించే పనిని కూడా నవంబర్ 15వ తేదీ కల్లా తప్పనిసరిగా పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్లు అడిగిన సాంకేతిక సందేహాలను నివృత్తి చేస్తూ, సరైన సూచనలు ఇచ్చారు. అలాగే ఆదివారం ఆర్జేడీ కుమార్ రణస్థలం మండలంలోని నారాయణపట్నం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. అక్కడ జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ రికార్డుల ధృవీకరణ, వెక్టరైజేషన్ పనులను స్వయంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి, వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. అంతకుముందు, ఏ.డి. సర్వే కార్యాలయంలో సిబ్బంది నిర్వహణ, వారి పనితీరుపై సమీక్ష జరిపి, సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బందిని అభినందించారు. భూమి పునఃసర్వే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని అధికారులకు మరోసారి స్పష్టం చేశారు.

## ముగిసిన సముద్రపు గవ్వల హస్తకళా శిక్షణ



**శ్రీకాకుళం, నవంబరు2(వార్త):** జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ఆర్థిక సహకారంతో, యూత్ క్లబ్, బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగనగళ్లవానిపేట గ్రామంలో నిర్వహించిన 'సముద్రపు గవ్వలతో గృహోపకరణాల తయారీ' మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ 15 రోజులపాటు సాగింది. ఈ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో 30 మంది స్వయం సహాయ సంఘాల మహిళలు పాల్గొన్నారు. యూత్ క్లబ్ డైరెక్టర్ మేడూరి ప్రసాదరావు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా మహిళలు సముద్రపు గవ్వలతో అలంకార వస్తువులు, గిఫ్ట్ ఐటమ్స్, డోర్ కర్టెన్లు వంటి వినూత్న ఉత్పత్తులను తయారు చేసే నైపుణ్యాన్ని పొందారన్నారు. వీరిని చిన్న స్థాయి వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడం మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కె.రమేష్ కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత నాబార్డు ముఖ్య ప్రాధాన్యతాంశమని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణ సదుపాయాలు కల్పించి, యూనిట్ల స్థాపనకు తోడ్పడతామన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో జరిగే ఎగ్జిబిషన్లలో వీరికి ఉత్పత్తులు ప్రదర్శించే అవకాశం కల్పించి, మార్కెటింగ్ సదుపాయాలు ఉంచుతామని చెప్పారు. ఈ మహిళలకు హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా ఆర్టిసన్ ఐడి కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గోగు కిరణాలు రైతు ఉత్పత్తిదారుల కంపెనీతో లింక్ చేసి, రూరల్ మార్ట్ ద్వారా వీరి ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి సహకరిస్తామన్నారు. గ్రామ ప్రతినిధి చీకటి ఆమోజీరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు గ్రామీణ మహిళల జీవితాలను మార్చగల శక్తి కలిగివుంటాయన్నారు. మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ హేమలత మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న మహిళలు తక్కువ సమయంలోనే గవ్వల హస్తకళల తయారీ పట్ల మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించారనానరు. అనంతరం శిక్షణ పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికేట్లు అందశారు.

## గ్రానైట్ క్వారీ బాధితులకి ఆర్థిక సహకారం

**మెళియాపుట్టి నవంబరు2 (వార్త):** ఇటీవల కాలంలో మండలంలో ఓ గ్రానైట్ క్వారీలో పిడుగు పడిన సంఘటనలో అనారోగ్యానికి గురైన బాధితుడు కరణం బాలరాజు రెడ్డిని కలిసి పరామర్శించి ఆర్థిక సహకారాన్ని టిడిపి నాయకురాలు బైరిసింగి ధరణి ఆర్థిక సహకారాన్ని అందించారు. రామచంద్రపురం గ్రామంలో ఆదివారం జరిగిన వనభోజన కార్యక్రమంలో జడ్పిటిసి ఎండయ్య, ఆ గ్రామ సర్పంచ్ వసంత కుమారి,గ్రామస్తులతో కలిసి ధరణి వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా వెంకటాపురం సర్పంచ్ జయమ్మ అప్పారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కదంబల షణ్ముఖరావు, అవలింగ అప్పారావు, వార్డు సభ్యులు ఆసరి బాబురావు, గ్రామ మహిళా సంఘ సభ్యులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు. అంతకుముందు ఇటీవల కాలంలో గంగరాజుపురం గ్రామంలోనున్న గ్రానైట్ క్వారీలో పిడుగు పడిన విషాద ఘటనలో బందపల్లి గ్రామానికి చెందిన బాధితుడు కారణం బాలరాజు రెడ్డిని కలిసి పరామర్శించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



# కాశీబుగ్గ ఘటన బాధితులకు భరోసా

**శ్రీకాకుళం, నవంబరు2(వార్త):** కాశీబుగ్గ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం తక్షణం అందజేసింది. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గౌండు శంకర్ తో కలిసి ఆదివారం ఉదయం వారికి చెక్కులను అందజేశారు. రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులను కలెక్టర్, ఎమ్మెల్యే స్వయంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం ప్రకటించిన రూ. 3 లక్షల విలువ చేసే చెక్కులను ముగ్గురు బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. వైద్య చికిత్స పొందుతున్న దువ్వు కుమారి (25): బడే కళావతి (49), బోడసింగి నిమ్మమ్మ (55)లకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, వైద్య సిబ్బంది ఉన్నారు.

*** రూ.3 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే**



## మృతుల కుటుంబాలకు 25 లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియో ఇవ్వాలి

*** సీపీఐ రాష్ట్రకార్యదర్శి ఈశ్వరయ్య**



**పలాస, నవంబరు2 (వార్త):** కాశీబుగ్గ వెంకటేశ్వర దేవాలయంలో జరిగిన భక్తుల తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షలు రూపాయలు చొప్పున ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. శనివారం జరిగిన ఈ ప్రమాద ఘటన సమాచారం తెలుసుకున్న ఆయన ఆ పార్టీ నేతలతో కలిసి కాశీబుగ్గ చేరుకున్నారు. ప్రమాద ఘటనకు కారణాలపై ఆరా తీశారు. అనంతరం పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ దేవాలయంలో 9 మంది ప్రాణాలు విడిచిన సంఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్రమంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి మాట్లాడిన మాటలు తీవ్ర ఆక్షేపనీయమైనవని తప్పుపట్టారు. అది ప్రైవేట్ గుడి అంటూ ప్రభుత్వం తప్పించుకోవడం సరికాదన్నారు. గుడి, బడి ఏదైనా అక్కడ జరిగిన సంఘటనపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీ సమయంలో తిరుపతిలో తొక్కిసలాట జరిగి అక్కడ భక్తులు చనిపోయారని, అది మరవక ముందే సింహాచలంలో గోడ కూలి భక్తులు చనిపోయారని, అటువంటి ఘటన శ్రీకాకుళం జిల్లాలో కూడా జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. పండుగ దినాల్లో దేవాలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, రక్షణ చర్యలు ప్రభుత్వము, అధికారులు ఏర్పాటు చేయడం వారి బాధ్యత అని గుర్తు చేశారు. దీనికి గుడి నిర్వాహకులు సమాచారం ఇవ్వలేదని అధికారులు తప్పించుకోవడం సరైంది కాదన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు తక్షణమే అందజేయాలని, వారి వైద్యానికి అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబాలను కూడా ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే వి సత్యనారాయణ (నాని), ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షులు విమల, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు చాపర సుందర్లాల్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి ఎస్ హరికృష్ణ, నారాయణస్వామి, లోకనాథం ఉన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన బీజేపీ, జనసేన నాయకులు





**పలాస, నవంబరు2 (వార్త):** పలాస వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన దుర్ఘటనలో గాయపడిన క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం పరామర్శించారు. బీజేపీ నాయకులు గాయపడిన భక్తుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు, క్యూలైన్ నియంత్రణ, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, జనసేన పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డా.దుర్గారావు, జనసేన నాయకులు హరీష్ కుమార్ శ్రీకాంత్, గిరీష్, దేవ, నందిగాం ధర్మ రావు, కేదార్, ఉదయ్ కిరణ్, బుద్ద కిషోర్, దిలీప్ పాత్రో, దీన పాత్రో, కరణి శ్రీను, శంకు శ్రీకాంత్, బీజేపీ మాజీ కన్వీనర్ రామానంద స్వామి, పాలవలస వైకుంఠరావు, కుర్రాయి బాలకృష్ణ యాదవ్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతులకు నివాళి



**ఇచ్ఛాపురం,నవంబరు2(వార్త):** పలాస వెంకటేశ్వరస్వామీ గుడిలో భక్తులు తొమ్మిది మంది మృత్యువాత పడడం చాలా బాధాకరమని వైసీపీ నాయకులు అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కేండిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, ఇచ్ఛాపురం నియోజకవర్గం యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ప్రత్తి అన్వేష్, మండలపార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ లాబాల స్వర్ణమణి, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఇసురు తులసిరామ్, బచ్చు జగన్, సల్ల దేవరాజు, సర్పంచ్లు నర్తు వరప్రసాద్, దుక్క ధనలక్ష్మి, ఆసి దాలయ్య రెడ్డి, నీలాపు సారధి, నీలాపు జగదీష్ రెడ్డి, ఆసి పురుషోత్తం రెడ్డి, పలికల జయరాం, జుత్తు కామేష్, కొప్పుల హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



## రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

**మందస, నవంబరు 2(వార్త):** దేవుని దర్శనానికి వెళ్ళి మరణించిన భక్తుల కుటుంబాలకు రూ.15లక్షల వంతున రాష్ట్రప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. ఎక్స్ గ్రేషియా దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా రూ.15లక్షల నష్టపరిహారం చెక్కులను మృతుల కుటుంబాలకు అందజేశారు. రెండు రోజుల క్రితం కాశీబుగ్గ సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనలో మందస మండలానికి చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందారు. మందస గ్రామానికి చెందిన బోర బృందావతి, బెల్లుపట్టియా గ్రామానికి చెందిన దువ్వు రాజేశ్వరి ఈ దుర్ఘటనలో మరణించగా వారి కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలు ఆదివారం రూ.15లక్షల నష్టపరిహారం చెక్కులను అందజేశారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గణితంలో అభిరుచి పెంచేందుకే ప్రతిభా పరీక్షలు



**మందస, నవంబరు 2(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తిని పెంచేందుకే గణిత ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మందస మండల సిక్కోలు గణిత వేదిక ప్రతినిధులు గవ్వ భీమారావు, వమరవల్లి మురళిలు తెలిపారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక, శ్రీకాకుళం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి, జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తూ, విజేతలకు బహుమతి ప్రదానం చేస్తుంటారు. ఈ సందర్భంగా మందస మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షను హరిపురం ఉన్నత పాఠశాల కేంద్రంగా నిర్వహించారు. పరీక్షలో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుండి 140 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల నుండి ఎన్.భార్గవి, ఎస్.శశాంక్, ఎస్.కరణ్, పి.సాయిరరాం, కె.అఖిల్, సొండిపూడి ఉన్నత పాఠశాల నుండి ఎల్.కౌశిక్, ఎం.భరద్వాజ్, జె.నిహారిక, హరిపురం ఉన్నత పాఠశాల నుండి డి.త్రిలోచన, ఎ.రష్మిత, ఆర్.అక్షయ్ కుమార్, జీఆర్ పురం ఉన్నత పాఠశాల నుండి ఎస్.పవన్, ఎస్.మహాలక్ష్మి, టి.మౌనిక, వి.ప్రవీణ్, మందస ఉన్నత పాఠశాల నుండి ఎం.ఝాన్సీ, టి.దివాకర్, వి.పూజ, పి.షణ్ముఖరావు, జి.సిద్దార్ధకుమార్, బహడపల్లి ఉన్నత పాఠశాల నుండి ఎస్.వైష్ణవి, అంబుగాం ఉన్నత పాఠశాల నుండి పి.షర్మిల అనే విద్యార్థులు మండల స్థాయిలో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వీరికి జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష ఈ నెల 23 లేదా 30న కాశీబుగ్గ ఉన్నత పాఠశాల కేంద్రంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు జి.రమణబాబు, నడుమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు చక్రధర్, కె.సాంబమూర్తి, మండలంలోని వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు కృష్ణారావు, శ్రీనివాసరావు, అరుణ్ కుమార్, సురేష్ చంద్రపండా, జగన్నాధరావు, తిరుమలరాజు, ఈశ్వరరావు, భాస్కరరావు, ప్రకాశరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు వైసీపీ నేతల పరామర్శ

**ఇచ్ఛాపురం,నవంబరు2(వార్త):** కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది ప్రాణాలు కోల్పోయారని వార్త తెలిసి వైస్సార్సీపీ రాష్ట్ర నాయకులు, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యన్నారాయణ, వైస్సార్సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోర్డినేటర్ కురసాల కన్నబాబు, శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షులు తమ్మినేని సీతారాం, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ పరిశీలకులు కుంభ రవిబాబు, పలాస నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ డా. సీదిరి అప్పలరాజు పరామర్శించారు. వారి వెంట శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇంచార్జి పిరియా విజయ, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ పేరాడ తిలక్, ఆమదాలవలస నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ చింతాడ రవి, రాష్ట్ర వైస్సార్సీపీ కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ రాష్ట్ర సీడప్ కార్పొరేషన్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైస్సార్సీపీ జిల్లా నాయకులు మెంటాడ స్వరూప్ పార్టీ నాయకులు ఉన్నారు.



## క్షతగాత్రులకు కేంద్ర మాజీ మంత్రి కృపారాణి పరామర్శ

**పలాస, నవంబరు2(వార్త):** కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో జరిగిన తొక్కిసలాట సంఘటనలో గాయపడిన క్షతగాత్రులను పలాస ఆసుపత్రిలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి డా.కిల్లి కృపారాణి పరామర్శించారు. డొక్కరి అమ్ములమ్మ చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యసేవలు అందించాలని, మృతి చెందిన కుటుంబానికి రూ.50లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా అందించాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆమె వెంట డీసీసీ మాజీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, బద్రి సీతమ్మ, గుప్తా, రమేష్, సతీష్, పలువురు నేతలు ఉన్నారు.



## మృతుల కుటుంబాలకు ఎంపీపీ పరామర్శ

**కంచిలి, నవంబరు 2 (వార్త):** కంచిలి మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు పార్టీ నాయకులు ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి మరి కొంతమంది పార్టీ నాయకులు కలిసి ఆదివారం పరామర్శించారు. కేసరి పద గ్రామంలో ఇప్పిలి చంద్రశేఖర్, శాసనం గ్రామంలో రాము బెహరా ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను కలిసి మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించి ఆ కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నేతలు వజ్జ మృత్యుంజయ రావు, దుర్గాసి ధర్మారావు, తలగాన తిరుపతిరావు, కొనపల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

**కోటబొమ్మాళి, నవంబరు 2 (వార్త) :** సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కోటబొమ్మాళి ఆవరణలో 8,9,10 విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలో గల 17 ఉన్నత మరియు ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 8వ తరగతి నుంచి 80 మంది, 9 వ తరగతి నుంచి 73 మంది, 10 వ తరగతి నుంచి 79 మంది మొత్తం 232 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్ష లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎం. కృష్ణారావు ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. పరీక్ష అనంతరం ప్రతీ తరగతి నుంచి మొదటి 5 మార్కులు సాధించిన విద్యార్థులు చొప్పున మొత్తం 3 తరగతుల నుంచి 24 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పరీక్షకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల నుంచి గణిత ఉపాధ్యాయులు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి... ఎర్రన్నాయుడు



**శ్రీకాకుళం, నవంబరు 2(వార్త):** రాజకీయ ఉద్ధండులు, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జిల్లాకు, రాష్ట్రానికి అందించిన సేవలు చరిత్ర పుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా, నగరంలోని అరసవిల్లి మిల్లు జంక్షన్ వద్ద ఉన్న 80 అడుగుల రోడ్డులో ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా యంత్రాంగం, పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, ఎర్రన్నాయుడు నిజమైన ప్రజా నాయకుడని, ఆయన కేవలం పదవులకే పరిమితం కాలేదన్నారు. జిల్లా ప్రజల కష్టాలను, అవసరాలను తన కష్టాలుగా భావించి, అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి నిరంతరం శ్రమించారని తెలిపారు. ఆయన ఆశయాల స్ఫూర్తితోనే, మేము కూడా శ్రీకాకుళం అభివృద్ధికి కట్టుబడి ఉంటామని చెప్పారు. నేటి యువత, ఆయన చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎర్రన్నాయుడు వర్ధంతి

**ఇచ్ఛాపురం, నవంబరు2(వార్త):** బస్టాండ్, మార్కెట్ జంక్షన్‌లలో కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా ఎర్రన్న విగ్రహానికి మండలం పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మృతి చెందిన వారికి సైతం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దక్కత ఢిల్లీరావు, ఎల్ పద్మనాభం, కోటి, సాలిన ఢిల్లీ, కె శంకర్ రెడ్డి, డి.కామేశ్వరరావు, డి.శ్రీనివాస్, ఎ.లీలారాణి, ఎన్.జానీ, దుర్యోధన, యు. సంతోష్, ఈశ్వరరావు, ఆర్. జానీ, రాజేంద్ర ప్రసాద్, నాగరాజు పాత్రో, బి.లోహిదాస్, యువరాజు, రామారావు, ధర్మరాజు, సుభాష్, శంకర్ నారాయణ, సారధి, ప్రసాద్ ఆచారి, రామకృష్ణ, తిప్పన చంద్రశేఖర్, గణపతి, కామరాజు పాల్గొన్నారు.

## ఎర్రన్న విగ్రహానికి నివాళి



**నరసన్నపేట, జలుమూరు, నవంబరు 2(వార్త):** నరసన్నపేట పట్టణంలో జుట్టు కళాసీ యూనియన్ ఆవరణలో, మార్కెట్ వీధిలో, నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కింజరాపు ఎర్రన్న 13వ వర్ధంతి సందర్భంగా ఎర్రన్నాయుడు విగ్రహానికి, చిత్రపటానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎర్రన్నాయుడు ప్రజల మనిషిగా, అభివృద్ధి పథంలో శ్రీకాకుళం జిల్లాను ముందుకు నడిపిన దూరదృష్టి కల నాయకుడని పేర్కొన్నారు. ఆయన ప్రజల సమస్యలను తనవిగా భావించి కష్టపడి పనిచేశారని, ఆయన ఆశయాలు తాము అనుసరించబోతున్నామని తెలిపారు. అదే సందర్భంలో ఇటీవల కాశీబుగ్గలో జరిగిన దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సభలో పాల్గొన్న వారు రెండు నిమిషాలు మౌనం పాటించి, ప్రియనేతకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎర్రన్నాయుడు సేవలను స్మరించుకున్నారు.

## గ్రామాల్లో ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి




**సంతబొమ్మాళి, నవంబరు2 (వార్త):** మండలంలో నౌపడ, మర్రిపాడు సంతబొమ్మాళి, వెంకటాపురం, జగన్నాధపురం, బోరుభద్ర శ్రీకృష్ణాపురం చెట్లతాంధ్ర అంట్లవరం తదితర గ్రామాలలో కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీగా మకుటం లేని మహా నేతగా ఎదిగిన నాయకుడు ఎర్రన్నాయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అభ్యర్థి కర్రి విష్ణు,దల్లి రాజు, సుగ్గు చిన్నయ్య, కర్రీ శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోంపేట టీడీపీ కార్యాలయంలో.. ఎర్రన్నాయుడు వర్ధంతి

**సోంపేట, నవంబరు2 (వార్త):** కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి కార్యక్రమాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు సోంపేట పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు మద్దు కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షుడు చిత్రాడ శేఖర్, కోదండరామ ఆలయ ట్రస్ట్ చైర్మన్ బీన ఆనంద్ మాట్లాడుతూ ఎర్రన్నాయుడు ఈ జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన ఎర్రన్నాయుడు ఒక స్ఫూర్తివంతమైన నాయకుడని పేర్కొన్నారు. రాజకీయాలలో ఆయన ఒక ఆదర్శవంతమైన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి మద్దిల నాగేశ్వరరావు, పొందూరు రాజు, బిన ఈశ్వరరావు, మద్దు రవి, మద్దు రాజారావు, బూరెల లింగరాజు పాల్గొన్నారు.



## ఎర్రన్నాయుడు సేవలు స్ఫూర్తిదాయకం



**పలాస, నవంబరు2(వార్త):** రాజకీయ ఉద్ధండులు, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జిల్లాకు, రాష్ట్రానికి అందించిన సేవలు చరిత్ర పుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రెడ్డి, ఎమ్మెల్యే గౌతు శిరీషలు అన్నారు. ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యే గౌతూ శిరీషలు మాట్లాడుతూ ఎర్రన్నాయుడు జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎర్రన్నాయుడు చూపిన మార్గంలోనే ముందుకు సాగుత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కీర్తిప్రతిష్టలను దేశస్థాయిలో ఇనుమడింప జేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఎర్రన్నాయుడు నిజమైన ప్రజానాయకుడని అన్నారు. కేవలం పదవులకే పరిమితం కాక, జిల్లా ప్రజల కష్టాలను, అవసరాలను తన కష్టాలుగా భావించి, అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి నిరంతరం శ్రమించా రని గుర్తుచేసుకున్నారు. ఎర్రన్న ఆశయాల స్ఫూర్తితోనే తాము కూడా శ్రీకాకుళం అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, నేటి యువత ఆయన చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఉద్ఘాటించారు. ఈ కార్య క్రమంలోవీరితో పాటు మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ, పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఏ పి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, స్థానిక మున్సిపాలిటీకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై వెలగని లైట్లు




**నరసన్నపేట, జలుమూరు, నవంబరు2(వార్త):** గొట్టిపల్లి వద్ద జాతీయ రహదారిపై రెండు రోజులుగా రాత్రి వేళల్లో లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. తెల్లవారు జామున కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దేవాలయాలకు వెళ్లే మహిళలు అవస్థలు పడ్డారు. చీకట్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని భయపడ్డారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## బెల్ట్ షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు



**సారవకోట, జలుమూరు, నవంబరు 2(వార్త):** సారవకోట మండలంలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తహసీల్దార్, మండల మెజిస్ట్రేట్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం సారవకోట తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన అవలంగి, బుడితి, బైదలాపురం, బెజ్జి, బంజీరు పేట, భద్రాచలం, గోపాలపురం, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన 40 మంది బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసులను ఎక్సైజ్ శాఖ అధికారులు నమోదు చేశారన్నారు.

## వాసుదేవుని దర్శించుకున్న మంత్రి ఆనం



**మందస, నవంబరు 2(వార్త):** మందస పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా వీరిని ఘన స్వాగతం పలికారు. ఆనంతరం ఆలయంలో వేదమంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపి నంబాళ్ళ దాసుకూర్మాచార్యులు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## ఎర్రన్నకు నివాళి

**శ్రీకాకుళం, నవంబరు2 (వార్త):** జిల్లా పోలీసు కార్యాలయంలో కింజరాపు ఎర్రంనాయడు 13వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీకాకుళం టౌన్ ఇన్స్పెక్టర్ కె.పైడిపు నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ పి.ఈశ్వరరావు, ఆర్ఐ కె.నర్సింగరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, నవంబరు2 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం పది గంటలు నుండి నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## నిఖిల్ కుటుంబానికి ఎంపీపీ పరామర్శ



**సోంపేట, నవంబరు 2(వార్త):** కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన లొట్ల అఖిల్ కుటుంబాన్ని మండల పరిషత్ అధ్యక్షులు, డాక్టర్ దాసు ఆదివారం పరామర్శించారు.

## మొంథా బాధితులకు అండగా కాళీ మాత సేవా సమితి




**ఇచ్ఛాపురం,నవంబరు2(వార్త):** ఇచ్ఛాపురం మండలంలో కేశుపురం గ్రామంలో మొంథా తుఫాన్ వల్ల ఇల్లు కోల్పోయిన బాధితురాలికి కాళీమాతా సేవా సమితి ఆదుకుంది. బాధితురాలికి రూ.50వేలు తక్షణ సాయం కింద అందజేశారు. పేదలకు అండగా కాళీమాతా సేవా సమితి ఉంటుందని సంస్థ ప్రతినిదులు తెలిపారు.



## బీసీ, ఓబీసీ ఉద్యోగ సంఘాల ఐక్యత వర్ధిల్లాలి

**శ్రీకాకుళం, నవంబరు 2 (వార్త):** రాష్ట్రంలో ఉండే బీసీ, ఓబీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి బీసీ ఓబీసీ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో భారీసదస్సు ఏర్పాటు చేస్తున్నామని అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల వీరబ్రహ్మం, పక్కి భూషణరావులు చెప్పారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో జిల్లా బీసీ ఓబీసీ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది.. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర కమిటీ నుండి వచ్చిన పి.రామచంద్ర రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ ఓబీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ.. నవ్యాంధ్ర ప్రదేశ్‌లో బీసీ.. ఓబీసీ ఉద్యోగ సంఘాల ప్రధాన లక్ష్యం.. బీసీ ఉద్యోగుల ఐక్యత .. రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన అని అన్నారు. ఉన్న రాజధాని అమరావతిలో జ్యోతిరావు పూలే స్మారక భవన్ నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. పదోన్నతుల్లో బీసీ రిజర్వేషన్ పాటించాలని.. మిగిలిన ఉద్యోగ సంఘాల తరహాలో బీసీ ఓబీసీ ఉద్యోగ సంఘానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు ఐదు లక్షల మంది బీసీ.. ఓ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉద్యోగాలు చేస్తున్నారని.. వీరి సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఉద్యోగ సంఘాల నేతలు వై.శంకరరావు, పి.బాలభాస్కరరావు, వి.కామేశ్వర రావు, జే.రామకృష్ణ రావు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల పరిశీలికునిగా డాక్టర్ డి.చక్రపాణి వ్యవహరించారు. బీసీ ఓ బీసీ ఉద్యోగ సంఘానికి అధ్యక్షుడిగా డాక్టర్ చింతాడ రాజశేఖర రావు.. అసోసియేట్ అధ్యక్షునిగా డాక్టర్ వై.పోలినాయుడు, ప్రధాన కార్యదర్శిగా బలగ మల్లేశ్వరరావులను ఎన్నుకున్నారు. మిగిలిన పోర్ట్ పోలియోలకు వారం రోజుల్లో ఎంపిక చేసి రాష్ట్ర కమిటీకు పంపిస్తామని శ్రీకాకుళం జిల్లా బీసీ ఉద్యోగ సంఘాల నేత డాక్టర్ దువ్వ చక్రపాణి స్పష్టం చేశారు.

## బంగారు పుస్తెలతాళ్లు అందజేత



**అరసవల్లి, నవంబరు 2(వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామికి శ్రీకాకుళం వాస్తవ్యులు పొడుగు వెంకటసూర్య ప్రభాకరరావు, పొడుగు వెంకట రాజేష్ కన్నా, పొడుగు కరుణాకర్ రావు ఆదివారం 29 గ్రాముల 820 మిల్లిగ్రాముల బంగారం (శతమానంతో కూడిన3పుస్తీల తాళ్ళు) ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ, ఆలయఈవో ప్రసాద్‌కు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామి వారి ప్రసాదాలు, ఫోటోను అందించారు.

## గణిత ప్రతిభా పరీక్షల్లో విద్యార్థులు



**జలుమూరు, నవంబరు2 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణిత ప్రతిభా పరీక్షలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. ఆదివారం జలుమూరు మండలం చల్లవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షలకు 186 మంది విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. ఈ పోటీల్లో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు.

## అపరిచిత సందేశాలకు స్పందించవద్దు




**పోలాకి, జలుమూరు, నవంబరు 2(వార్త):** పోలాకి మండలం అంపలాంలో మహిళలకు శక్తియాప్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహిళా భద్రతకు శక్తి యాప్ రూపొందించబడిందని, దీన్ని ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాప్లోని టోల్ ఫ్రీ నంబర్లు అత్యవసర సమాచారాన్ని పోలీసులకు అందజేస్తాయన్నారు. ఆన్లైన్ మోసాలపై, అపరిచిత సందేశాలకు స్పందించవద్దని అవగాహన కల్పించారు. శక్తి టీం ఇన్చార్జి గిరిధర్, చామంతి పాల్గొన్నారు

## పిన్నింటిపేటలో సంతకాల సేకరణ

**పోలాకి, జలుమూరు, నవంబరు 2(వార్త):** పోలాకి మండలం పిన్నింటిపేట జంక్షన్లో వైసీపీ నాయకులు సంతకాలు సేకరించారు. మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని ఖండిస్తూ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా తయారవుతుందన్నారు. ఎంపీపీ భైరగినాయుడు, వైస్ ఎంపీపీ తాతారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మారని హరిపురం పంచాయతీ పాలకుల తీరు



**మందస, నవంబరు 2(వార్త):** పుణ్యకాలమంటే ఎవరైనా స్పందిస్తారు.. కానీ, హరిపురం పంచాయతీ పాలకులు మాత్రం మొద్దు నిద్రలోనే ఉన్నారు. ప్రజల సమస్యలను పత్రికలు వెలుగులోకి తీసుకువచ్చినా.. స్పందించడంలేదు. పంచాయతీలో పారిశుద్ధ్యంపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. చెత్తా, చెదారం ఎత్తుకు వెళ్లే ట్రాక్టర్ వ్యవహారంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది.. కనీసం కార్తీకంలో కూడా భక్తులు నిత్యం నడిచే రహదారులను పట్టించుకోవడంలేదు. దీంతో భక్తులకు కష్టాలు తప్పడంలేదు. శివాలయానికి వెళ్లే రహదారి బురదతో నడవడానికి వీలులేనప్పటికీ, ఆలయాలకు తప్పని పరిస్థితుల్లో వెళ్తున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు, సిబ్బందికి శాపనార్థాలు పెడుతున్నారు. కనీసం కార్తీకంలో కూడా పంచాయతీని పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మేజర్ పంచాయతీలో.. సమస్యలు మేజరే!

* సమస్యల సుడిలో 'గాయత్రి నగర్' * పట్టించుకోని అధికారులు, పాలకులు * దశాబ్దాలు గడుస్తున్న నోచుకోని మౌలిక వసతులు





**మందస, నవంబరు 2(వార్త):** మందస మేజర్ పంచాయితీ పరిధిలో గల గాయత్రి నగర్ ఏర్పడి సుమారు 15 సంవత్సరాలు కావస్తోంది. అయినప్పటికీ ఈ కాలనీలో మౌలిక వసతుల కల్పన జరగలేదు. రహదారి, డ్రైనేజీల నిర్మాణాలు జరగక కాలనీ కంపు కొడుతుంది. వర్షం కురిస్తే అడుగు బయటకు వేయలేని దుస్థితి నెలకొనడంతో పాటు తీవ్ర దుర్వాసనతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు.వర్షాకాలం కావడంతో నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండడంతో దోమల బెడద వెంటాడుతోంది.దీంతో దోమ కాటు జ్వరాలైన మలేరియా,డెంగ్యూ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మరోవైపు రాత్రిపూట పాముల బెడద వెంటాడుతుంది. రోడ్డుపై గల నీటిలో పాములు సంచరిస్తుండడంతో నడిచి వెళ్లేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారు. మరోవైపు పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. అసలు మేజర్ పంచాయతీలో గాయత్రి నగర్ అనే ఒక కాలనీ ఉన్న విషయం అధికారులకు తెలుసో లేదో..? అని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. స్థానిక సమస్యలపై గతంలో పలుమార్లు స్పందనలో మండల అధికారులకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఫలితం శూన్యమని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమ గోడును పంచాయతీ అధికారులు గాని, మండల అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలను అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్న సమయంలో గాయత్రి నగర్ రియల్ ఎస్టేట్ వెంచర్లని, అందుకే అభివృద్ధికి నోచుకోవడం లేదని బదులిస్తుండడం శోచనీయం. గాయత్రి నగర్ ఏర్పడి సుమారు 15 సంవత్సరములు కావస్తున్న మౌలిక వసతులకు నోచుకోకపోవడం ఒకవైపు ఆందోళన కలిగిస్తున్న విషయం. మరోవైపు గతంలో కొత్త వెంచర్లు పంచాయతీలో ఇష్టానుసారం పుట్టుకు రావడం గమనార్హం. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం కనిపిస్తున్న ప్రజా ప్రతినిధులు, అనంతరం ఇటువైపు తొంగి చూడని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా గాయత్రీ నగర్ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

## శిథిలావస్థలో ఎంఎస్‌పల్లి వసతి గృహం

* ఒకే గదిలో 50 మంది విద్యార్థులు * ఇరుకు గదుల్లో నానావస్థలు * పట్టించుకోని సంబంధిత అధికారులు




**సోంపేట /కంచిలి, నవంబరు 2 (వార్త):** వెనుకబడిన తరగతుల బీసీ విద్యార్థుల వసతి గృహాల పట్ల పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి కంచిలి మండలం మఠం సరియపల్లి (ఎంఎస్‌పల్లి ) వసతిగృహం అద్దం పడుతోంది. నిర్మాణం జరిగి రెండు దశాబ్దాలు పూర్తవుతున్న ఈ భవనాలు పక్కా మరమ్మత్తులు లేకపోవడంతో వర్షాలు సమయంలో స్లాబ్ నుంచి నీరు కారడం, స్లాబులు పెచ్చులు ఊడడం, నీటి సదుపాయం సక్రమంగా లేకపోవడం మొదలైన సమస్యలు విద్యార్థులను చుట్టుముడుతున్నాయి. దీని పట్ల ఎన్ని ఫిర్యాదులు చేసిన పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా సుదూర గ్రామాల నుంచి చదువుకునేందుకు ఎమ్మెస్ పల్లి వసతి గృహంలో చేరిన విద్యార్థులకు ఇక్కడ సమస్యలు తీవ్ర నిరాశ పరుస్తున్నాయి. విద్యార్థులకు అనుగుణంగా వసతి గదులు చాలకపోవడం ఇక్కడ పెద్ద సమస్యగా చెప్పవచ్చు. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు ఉన్న ఈ వసతి గృహంలో సుమారు 50 మంది విద్యార్థులకు ఒకే గదిలో పెట్టడం గమనార్హం. ఇరుకిరుకున రాత్రి వేళలో పడుకొని గడుపుతున్న విద్యార్థులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో అదనంగా కనీసం మరో రెండు గదులు నిర్మించాలని హాస్టల్ అధికారి ఉన్నతాధికారులను కోరుతున్నప్పటికీ వారి నుంచి ఇప్పటికీ స్పందన లేకపోవడం విద్యార్థుల దురదృష్టకరం. ఇదిలా ఉండగా హాస్టల్ స్లాబ్, గోడలు పెచ్చులు ఊడి రాలి పడుతున్నాయి. ఈ పెచ్చులు ఎప్పుడు ఎవరి మీద పడతాయో తెలియని పరిస్థితి. అన్నిటికన్నా నీటి సమస్య వసతి గృహానికి వెంటాడుతోంది. బోర్వెల్ ఉన్నప్పటికీ అవసరమైన నీరు అది విడుదల చేయకపోవడంతో స్నానాలు, టాయిలెట్లకు విద్యార్థులు అవస్థలు పడక తప్పడం లేదు. ఇలా సమస్యలు నడుమ కొట్టుమిట్టాడుతున్న వెనుకబడిన తరగతుల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వ పెద్దలు తగువిధంగా సహకరించకపోవడం బాధాకరమంటూ ఎమ్మెస్ పల్లి గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. ఇలాంటి భవనాల్లో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు ముందు ఎవరూ దరి చేరరని పలువురు వాపోతున్నారు.

### జిల్లా అధికారికి లేఖ రాశాను

శిథిల భవనం విషయమై హాస్టల్ అధికారి ఎన్ ఉపేంద్ర వద్ద వార్త ప్రతినిధి ప్రస్తావించగా భవనాల విషయంలో సమస్యలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హాస్టల్‌కు పక్కాగా మరమ్మతులు జరిపించాలని, అదనపు భవనాలు నిర్మించాలని జిల్లా సంక్షేమ అధికారికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

## మందసలో భక్తి, శ్రద్ధలతో తులసికోట ప్రతిష్ఠ

**మందస, నవంబరు 2(వార్త):** భక్తులంతా మందసలో భక్తి, శ్రద్ధలతో తులసికోటను ప్రతిష్టించారు. పవిత్ర కార్తీక మాసం కావడంతో మందస పట్టణంలోని బోయివీధిలో గల పవిత్రమైన రావిచెట్టు వద్ద మండపం, తులసికోట ప్రతిష్ట, హోమం ఫ్రెండ్లీ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అర్చకుడు కొమ్మాజోస్యుల సీతారామశర్మ(రవిసాయి) ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య తులసికోటను ప్రతిష్టించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు మల్లారెడ్డి హేమరాజు, బెస్త కామేశ్వరరావు, కొయ్య భవన్నా రాయణరెడ్డి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, మద్ది నవీన్ దంపతులు, పూనా రమేష్, మద్ది సీతారాం, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.





## తొక్కిసలాట ఘటనపై వైసీపీది అసత్య ప్రచారాలు

* పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**పాతపట్నం, నవంబరు 2 (వార్త):** కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటపై వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హితవు పలికారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన బాధాకరమన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలన్నారు. ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు తక్షణ సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. వైసీపీ నాయకులు ఈ దుర్ఘటనను కూడా రాజకీయ లాభం కోసం వాడుకోవడం తగదని హితవు పలికారు.

## గ్రూప్ డి నమూనా పరీక్షకు విశేష స్పందన

* ఒక్క రోజులోనే 400 స్లాట్లు రిజర్వేషన్
* పరీక్ష రాసిన 358 విద్యార్థులు
* మరోసారి నిర్వహించాలని కోరుతున్న విద్యార్థులు



**శ్రీకాకుళం, నవంబరు2(వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక 'ఎర్రన్న విద్యా సంకల్పం'లో భాగంగా ఆర్ఆర్‌బీ, గ్రూప్–డి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగుల కోసం నిర్వహించిన కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్ ఆదివారం విజయవంతంగా జరిగింది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో పరీక్ష జరగగా.. మొత్తంగా 358 మంది ఈ పరీక్షను రాశారు. మెయిన్ పరీక్ష స్థాయిలో మాక్ టెస్ట్ నిర్వహించగా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మన్యం జిల్లాలకు చెందిన అనేక మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఉత్సాహంగా హాజరైన నిరుద్యోగులు ప్రశ్నాపత్రాన్ని ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ రాశారు. ప్రధాన పరీక్షకు తీసిపోని స్థాయిలో ఈ మాక్ టెస్ట్ జరగడం, భవిష్యత్‌లో మంచి స్కోరింగ్ కు ఉపయోగపడుతుందని అన్నారు. కాగా.. ఆర్.ఆర్.బి గ్రూప్ డి ప్రధాన పరీక్షకు సమయం సమీపిస్తున్న తరుణంలో ఈ మాక్ టెస్ట్ కు విశేష స్పందన లభించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష కోసం మొత్తం నాలుగు వందల స్లాట్లు అందుబాటులో ఉంచగా అవన్నీ రిజిస్ట్రేషన్ ప్రారంభించిన ఒక్క రోజుల్లోనే పూర్తి అవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోరిక మేరకు మరొక్కసారి పరీక్షను నిర్వహించాలని వారు కోరుతున్నారు. కాగా బృహత్తర లక్ష్యంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువత ఉద్యోగ అవకాశాల కోసం సిద్ధమవుతోందని.. పోటీ పరీక్షల్లో మంచి విజయాన్ని సాధించేందుకు మాక్ టెస్టులు ఎంతో ఉపయుక్తమవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన రెండు మాక్ టెస్టులకు ఇప్పటికే విశేష స్పందన వచ్చిన నేపథ్యంలో ఈ సిబిటి మాక్ టెస్ట్ కు మరింతగా రిజిస్ట్రేషన్ల వచ్చాయని.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించామని స్పష్టం చేశారు. ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నేతల నిర్లక్ష్యానికి.. పాతికేళ్లు!

## కూలేందుకు సిద్ధంగా ఉన్న బస్‌షెల్టర్



**సోంపేట / కవిటి, నవంబరు 2 (వార్త):** ఒకటి కాదు... రెండు కాదు.. ఏకంగా 25 ఏళ్ల కాలం పాటు మొండి గోడలతో మిగిలి ఉన్న కవిటి మండలం గొర్లపాడు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన శిలాగాం రోడ్డుకు ఆనుకొని అప్పట్లో నిర్మించిన బస్సు షెల్టర్ ఇప్పటికీ నేతలు పట్టించుకోక, అధికారుల అలసత్వంతో మొండి గోడలతోనే దర్శనమిస్తోంది. ఈ జంక్షన్లో ఈ బస్సు షెల్టర్ కు ఎనలేని ప్రాధాన్యం ఉన్నప్పటికీ ప్రయాణికులకు, బాటసారులకు ఏమాత్రం ప్రయోజనం కల్పించలేక ఉసూరుమంటుంది. 2000 సంవత్సరంలో కవిటి మండలం మండల అధ్యక్షురాలిగా పదవి అలంకరించిన నర్తు చామంతి రామారావు ఈ బస్సు షెల్టర్ కు పునాదిరాయి వేశారు. గోడల నిర్మాణం జరిగి స్లాబ్ కూడా పూర్తయినప్పటికీ లోపల ప్లాస్టింగులతో పాటు కూర్చోవడానికి సిమెంటు బల్లల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ మాత్రం పనికి రెండు దశాబ్దాలు దాటి అక్షరాల పాతికేళ్లు పూర్తవుతున్నాయి. అనంతరం కవిటి మండలానికి ఎందరో ప్రముఖులు మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. గొర్లపాడు పంచాయతీకి ఎంతోమంది సర్పంచులుగా పని చేశారు. ఏ ఒక్కరికి దీని విషయం పట్టకపోవడం గమనార్హం.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



**నెల్లిమర్ల, నవంబరు2(వార్త):** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. అలుగోలు గ్రామంతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని పల్లిపేట, కొత్తూరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన 'మన ప్రజలతో – మన ఎమ్మెల్యే' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తొలుతా సామాజిక పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వీధుల్లో పర్యటించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు పరిష్కార మార్గాలను కూడా సూచించారు. అలుగులలో జరిగిన సభా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలకులు చేసిన తప్పులు వల్ల రాష్ట్రంలో అప్పులు మిగిలాయని ఆమె విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తున్నదని అన్నారు. ప్రజలు పడుతున్న బాధలకు, తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలకు పరిష్కారం చూపిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. త్వరలోనే పేదలందరికీ ఇళ్ల పట్టాలిస్తామని, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని ఆమె ప్రకటించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల జల్ జీవన్ మిషన్ అక్రమాల లోగిలిగా తయారైందని ఆమె ఆరోపించారు. ప్రజలకు మంచి పాలన అందించాలని తమ ఉద్దేశమని అన్నారు. యువత, మహిళలు చిరు వ్యాపారుల ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించడానికి కృషి చేయాలని, ఇందుకు తమ ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని ఆమె వివరించారు. అలుగోలు పంచాయతీ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ గ్రామంలో వెలుగు వివోఏపై వచ్చిన ఫిర్యాదులు విన్న ఆమె తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. సెలవు దినము అయినప్పటికీ ఆదివారమే విచారణ పూర్తి చేయాలని వెలుగు ఏపిఎం సురేష్ ను ఆదేశించారు. అధికార యంత్రాంగం తప్పు చేస్తే ఊరుకునేది ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు,అంబల్ల అప్పలనాయుడు,ఎడ్ల గోవిందరావు, పతివాడ గోవిందరావు, గదల అచ్చమ నాయుడు, బద్రి, గ్రామ టిడిపి నాయకులు కురిమినేని దివాకర్, ఆల్తి బాబు రావు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ సండే స్కూల్‌లో ప్రార్థనలు

**ఇచ్ఛాపురం,నవంబరు2(వార్త):** అంతర్జాతీయ సండే స్కూల్ సందర్భంగా ఈదుపురం బాప్టిస్ట్ చర్చిలో, ఒడియా చర్చిలో, డొంకూరు, రక్తకన్నలో ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి అధ్యక్షులు ప్రత్తి విజయ కుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు పెన్నులు, పెన్సిల్స్, పరీక్ష అట్టలు 350 మందికి అందజేశారు, ఆంధ్ర ప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ స్టేట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్, మండపల్లి ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి లో పాస్టర్ ప్రకాష్ రావు, భాస్కర్ రావు పాల్గొని పిల్లలకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు.

## హరిపురంలో వంశధార సాగునీటి సాధన కమిటీ సమావేశం



**మందస, నవంబరు 2(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంథాలయంలో వంశధార సాగునీటి సాధన కమిటీ సమావేశం జరిగింది. వంశధార సాగునీటి సాధన కమిటీ నాయకులు పలు అంశాలపై చర్చించారు. ఈనెల 9న కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డీ, కొర్ల హేమారావుచౌదరి, మజ్జి బాబురావు, కొవ్వూరు దశరధ, వెదుళ్ళ మాధవరావు, డొక్కరి పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిబాబు రెడ్డి రక్తదానం



**ఇచ్ఛాపురం,నవంబరు2(వార్త):** తలసేమియా పిల్లలు, గర్భిణీల కోసం పలాస ప్రాణదాత బ్లడ్ సెంటర్, ఇచ్ఛాపురం జీఎస్ ఫౌండేషన్ మెగా రక్త దాన శిబిరం కొఠారి గ్రామంలో బ్లడ్ క్యాంపు నిర్వహించారు. మండపల్లి, ఎం. తోటూరుకి చెందిన పాతిర్ల గిరి బాబు రెడ్డి (51) రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. ఇప్పటికి 15 సార్లు రక్తదానం చేశారు, అలానే జి. ఎస్. ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న గిరి బాబుని ప్రాణదాత బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు సాయి, జి. ఎస్. ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీరామ్ ప్రశంసించారు.

## మహనీయుడు.. ఎర్రన్నాయుడు



**మందస, నవంబరు 2(వార్త):** రాజకీయాల్లో కొద్ది సంఖ్యలోనే మహానుభావులుంటారని, వారిలో చెప్పుకోదగ్గ మహనీయుడు కింజరాపు ఎర్రన్నాయుడు అని పలువురు తెలుగుదేశం నాయకులు అన్నారు. ఎర్రన్నాయుడు వర్ధంతి సభ మందసలో జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ శత్రువైనా ప్రేమించే మనస్తత్వం కలిగిన నేత ఎర్రన్నదన్నారు. రాజకీయాలను ప్రభావితం చేయగలిగిన నాయకుడు ఎర్రన్నాయుడని, ఉత్తరాంధ్ర టైగర్‌గా పిలుపించుకున్న ఆయన వాగ్ధాటి ఎవరికీ లేదన్నారు. ఎంతో ఉన్నత శిఖరాలను ఎదిగిన ఆయనకు గర్వం, అహంకారం, ఓర్వలేనితనం లేకపోవడం ఆయన వ్యక్తి త్వానికి నిదర్శనమన్నారు. భౌతికంగా ఎర్రన్న లేకపోయినా, ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ప్రజ మనిషిగా పేరొందిన ఎర్రన్నాయుడు ఎల్లప్పటికీ ప్రజల మనస్సుల్లో ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పులిహోరా ప్రసాదం నాణ్యతపై భక్తుల ప్రశంసలు



**జలుమూరు, నవంబరు2 (వార్త):** కార్తీకమాసం సందర్భంగా భక్తుల కోరిక మేరకు శ్రీముఖలింగేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఆన్లైన్ ద్వారా పులిహోర ప్రసాదం అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఆలయ ఈవో టీ.ఏడుకొండలు గారు స్వయంగా ఈ రోజు ప్రసాదం తయారీ విధానం, నాణ్యతను పరిశీలించారు. ప్రసాదం తయారీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందని, ప్రతి ప్యాక్‌లో 150 గ్రాముల పులిహోర ప్రసాదం రుచికరంగా, నాణ్యతతో సిద్ధమవుతోందని ఈవో వెల్లడించారు. భక్తుల నుండి కూడా పులిహోర ప్రసాదానికి మంచి స్పందన లభిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడు గారి రాజశేఖర్ పాల్గొని ప్రసాదం తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546